సర్వజన ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జిల్లా కలెక్టర్ సూర్యకుమారి మంగళవారం రాత్రి ఆకస్మికం తనిఖీ చేశారు. రాత్రి డ్యూటీల్లో వైద్యులు, సిబ్బంది హాజరు గురించి తెలుసుకున్నారు.పలువురు రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో వారికి అందుతున్న సేవలు, వైద్యులు, సిబ్బంది స్పందిస్తున్న తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కోవిడ్ సన్నద్ధత గురించి తెలుసుకుని వైద్యులు, తాజా పరిణామాల దష్ట్యా సిబ్బంది ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది తగిన సంఖ్యలో వున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. గుర్ల మండలం లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సపై వారి తల్లిదండ్రులతో మాట్లాడి తెలుసుకున్నారు.

సకాలంలో తొలకరి పలకరింపు... ప్రకృతి అనుకూలత వెరసి ఈ ఏడాది ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల పంట పండింది. వరితోపాటు ఖరీఫ్ సీజన్‌లో దాదాపు అన్ని పంటలూ ఆశాజనకంగా సాగయ్యాయి. గతంతో పోలిస్తే దిగుబడులు కూడా పెరిగాయి. కానీ, పెట్టుబడులే ఆకాశాన్ని అంటిపోయాయి. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేదు. మార్కెట్ సదుపాయాలూ లేకపోవడంతో ఎప్పటి మాదిరిగానే రైతన్న దళారులు, వ్యాపారుల వలలో చిక్కుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వరి రైతులు ధాన్యం విక్రయించుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే, విక్రయించినవారు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు.

- పెరిగిన దిగుబడి
- మించిపోయిన పెట్టుబడులు
- గిట్టుబాటు ధర లేక గిలగిల
- వ్యవసాయదారుల దుస్థితి

పంట పండినా పాట్లు తప్పలే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 3,22,677 ఎకరాలు కాగా, ఈ ఏడాది 3లక్షల 212ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి అత్యధికం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2లక్షల 27వేల ఎకరాలు కాగా, ఈఏడాది 2,32,360 ఎకరాల్లో సాగయ్యింది. దీనికి వాతావరణం కూడా అనుకూలించింది. సరిగ్గా ఉబాల సమయంలో కాస్త వర్షాలు అటుఇటుగా అయినా ఆగస్టు చివరి నాటికి అంతా అనుకూలంగా మారింది. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాల వల్ల కాస్త పంటలు దెబ్బతిన్నప్పటికీ మెజార్టీ విస్తీర్ణంలో ఆశాజనకంగానే కనపించింది. గత ఐదేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది సకాలంలో పంటలు సాగు చేయడం విశేషంగా చెప్పవచ్చు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు, సగటు దిగుబడి కూడా ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. సగటున ఎకరాకు 2,110 కిలోలు (26 బస్తాలు) ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కగట్టారు. అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఈ ఏడాది పెరిగాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ధరల కారణంగా వీటితో నడిచే నీటి ఇంజన్ల నిర్వహణ బహుభారంగా మారింది. ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగాయి. ఎప్పటి మాదిరిగానే ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోయాయి. వరి సాగుపై ఎకరాకు రూ.40వేల నుంచి రూ.45వేల వరకు ముదుపు అయ్యిందని ఇటీవల రైతు సంఘం నాయకులు చేపట్టిన సర్వేలో తేలింది. అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి అన్నట్టుగా పెట్టుబడులు పెరిగినప్పటికీ ఆ స్థాయిలో ధాన్యంపై ధర పెరగలేదు. రైతులకు మద్దతు పేరుతో రూ.2,040, ఎ-గ్రేడ్‌కు రూ.2,060గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే పెరిగింది. కేవలం రూ.100 మాత్రమే. ఇది ఎటూ సరిపోక రైతులు మళ్లీ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడక తప్పని పరిస్థితి. మరోవైపు ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వ యంత్రాంగం ప్రగల్భాలు పలికినప్పటికీ, ఆచరణ గడపదాటడం లేదు. సకాలంలో కొనుగోలు చేయకపోవడం రైతులు కళ్లాల్లోనే వాటికి కాపలా కాసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికి వరకు సేకరించిన ధాన్యానికి కూడా సకాలంలో చెల్లింపులు చేయలేదు. పండగ దగ్గరపడుతున్నా పైసలు ఇవ్వకపోవడంతో రైతు కుటుంబాల్లో ఒకింత నిరాశ, అసంతృప్తి నెలకొంది.

జిల్లాలో వరి తరువాత అంతటి ప్రాధాన్యతగల పంట పత్తి. ఈ ఏడాది సుమారు 50 వేల ఎకరాల్లో సాగైంది. పలు మార్లు కురిసిన భారీ వర్షాలకు కొంత దెబ్బతిన్నప్పటికీ వరి మాదిరిగానే ఈ ఏడాది ఉత్పత్తి ఆశాజనకంగానే వచ్చింది. మొక్కజొన్న ఈ ఏడాది సుమారు 30, 545ఎకరాల్లో సాగైంది. కానీ, వాటికి కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో రైతులు పూర్తిగా దళారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. నువ్వులు, వేరుశనగ, ఇతర అపరాల సాగు, గిట్టుబాటు ధరలు కూడా ఇదే పరిస్థితిలో ఉండడం వల్ల పంటలు నిండుగావున్నా కడుపు నిండని పరిస్థితి ఏర్పడింది.

వ్యవసాయం

పెరిగిన వరి సాగు విస్తీర్ణం

సంవత్సరం	సాగు విస్తీర్ణం (హెక్టార్లు)
2022-23	92,944
ఉమ్మడి జిల్లాలో	
2021-22	1,27,872
2020-21	1,18,868
2019-20	1,19,380
2018-19	1,21,499
2017-18	1,22,659
2016-17	1,22,205
2015-16	1,24,275
2014-15	1,18,950

పెరిగిన వరి దిగుబడి

సంవత్సరం	కేజీలు (ఎకరాకు)	దిగుబడి (మె.టన్నులు)
2022-23	2,110	4,63,128
ఉమ్మడి జిల్లాలో		
2021-22	2,004	6,32,966
2020-21	1,770	5,19,691
2019-20	1,974	5,82,336
2018-19	1,413	4,24,153
2017-18	1,807	5,47,607
2016-17	1,893	5,71,553
2015-16	1,791	5,49,917
2014-15	1,602	4,70,685

222 ఎకరాల్లో పంటనష్టం

అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 2,223.3ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. ముఖ్యంగా వందలాది ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. సరిగ్గా కొత దశకు వచ్చిన మొక్కజొన్నపై ఎడతెరిపిలేని వర్షం కురవడంతో మొక్కలు మొలిశాయి. పత్తి పంట కూడా చాలా చోట్ల నేలకొరిగింది. 17మండలాల పరిధిలోని 40గ్రామాల్లో వరి పంట 2,134.2 ఎకరాలు, పత్తి 45ఎకరాలు, మొక్కజొన్న 44.1ఎకరాల్లోనూ నీటమునిగినట్టు అధికారులు గుర్తించారు. మరోవైపు రైతు భరోసా అందని రైతులు ఎక్కువగానే ఉన్నారు. బ్యాంకు ఖాతాలు ఇన్ యాక్టివ్‌గా ఉన్నాయని, బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్లు లింకు కాలేదని, ఆదాయ పన్ను పరిధిలోవున్నారనే సాకులతో జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ యోజనకు ఎగనామం పెట్టింది. రైతులు ఎటు చూసినా ఆర్థిక ఇబ్బందుల్లోనే ఉన్నారు.

మెగా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్, జెడ్‌పిచైర్మన్, ఎమ్‌పి, కలెక్టర్

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 24,119 మందికి రూ.33.41 కోట్ల ద్వైవార్షిక నిధులు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలో అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక లబ్ధి కూరుతుందని ఉద్ఘాటించారు. అర్హత కలిగి సాంకేతిక, ఇతర కారణాలతో పథకాలు నిలిచిపోయిన వారికి ప్రత్యేక అవకాశం కల్పిస్తూ చేపట్టిన ద్వైవార్షిక నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అనంతరం స్థానిక వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి లబ్ధిపొందిన లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ తదితరులు చేతుల మీదుగా మెగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు కోల్పోయిన వారి సౌకర్యార్థం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పథకాలు వర్తింపజేయటం హర్షణీయమన్నారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం వచ్చే జనవరి నుంచి పింఛను పెంపు చేస్తూ అవ్వాతాతలకు రూ.2,750 అందజేయనున్నామని పేర్కొన్నారు.

కలెక్టర్ ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ అర్హతలు కలిగిన వారినే లబ్ధిదారులగా ఎంపిక చేశామని, ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి జిల్లాలో అమలవు తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. జిల్లాలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 2.74 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన పథకాల వల్ల జిల్లాలో 99 శాతం మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం లభించింది

పెదతాడివాడకు చెందిన అమ్మ ఒడి లబ్ధిదారురాలు వెలమల నాగమణి ముఖ్యమంత్రితో మాట్లాడారు. అమ్మ ఒడి పథకంలో భాగంగా రెండు విడతలు లబ్ధిపొందానని, అనుకోకుండా మూడో విడతలో ఇబ్బంది వచ్చిందని.. స్థానిక సచివాలయంలో సంప్రదించగా సమస్యను వెంటనే పరిష్కరించారని తెలిపింది.

రేపు కార్మిక చైతన్య బస్సుయాత్ర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలు జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్న నేపథ్యంలో ఈనెల 28న శ్రీకాకుళంలో ప్రారంభమైన కార్మిక చైతన్య బస్సుయాత్ర గురువారం ఉదయం 10గంటలకు కోటజంక్షన్ వద్దకు చేరుకుంటుందని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్రావు, బి. రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో కరపత్రం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు రాష్ట్ర మహాసభలో సమర శంఖారావం పూరించబోతునా మ్నని తెలిపారు. అసంఘటితరంగం, రవాణా రంగ కార్మికులకు, స్కీం వర్కర్లకు ఎటువంటి సామాజిక భద్రతా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, సంక్షేమ చట్టం కోసం పెద్ద ఎత్తున ఆందోళనకు సమాయత్తం చేసేందుకు కార్మిక చైతన్య యాత్ర జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామనాయుడు, శ్రీను, భాస్కరరావు, నాని, అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు త్రినాధ్ పాల్గొన్నారు.

అండర్ 14,17 అథ్లెటిక్స్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌జిఎఫ్ జిల్లా క్రీడాపోటీలు అథ్లెటిక్స్ అండర్ 14,17 విభాగాల్లో బాల బాలికల జట్లు ఎంపిక మంగళవారం రాజీవ్ క్రీడా మైదానంలో జరిగాయి. అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఎల్ వి రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో 34 మండలాల నుండి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. మొత్తం అండర్14 విభాగం లో బాలికలు 12 మంది, బాలురు 12 మంది, అండర్17 విభాగంలో 16 మంది బాలికలు, 16 మంది బాలురు, మొత్తం 56 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ తెలిపారు. వీరంతా శ్రీకాకుళంలో జనవరిలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు, సత్య సాయి జిల్లాలో జరిగే రాష్ట్ర హ్యాండ్ బాల్ పోటీలకు టీములు వెళ్లాయని తెలిపారు.

పరిపాలన చేతకాకే పింఛన్లు రద్దు

టిడిపి నాయకులు బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో పరిపాలన చేతకాక సామాజిక పింఛన్లు రద్దుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన విమర్శించారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్లు రద్దు చేసేందుకు ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. పింఛన్లు ఇవ్వడానికి డబ్బులు లేకనే రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డికి పరిపాలన చేతకాదన్నారు. నియోజకవర్గంలో 655 పింఛన్లు రద్దు చేసేందుకు నోటీలు ఇచ్చారన్నారు. విద్యుత్ బిల్లు, ఇంటి విస్తీర్ణం పింఛన్లకు ముడిపెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పరిపాలన చేతకపోతే అనుభవం ఉన్నవారి సలహాలు తీసుకోవాలని సూచించారు. పేదలను ఇబ్బందులు పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లపై ఒత్తిడి తేవడం వలనే వైసిపి సమావేశానికి హాజరయ్యారని విమర్శించారు. ఎన్నికల ముందు పింఛన్లు రూ. 3వేలు ఇస్తామని చెప్పి పెంచకుండా పేదలకు, సిపిఎస్ రద్దు చేయకుండా ఉద్యోగులకు, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులకు వైసిపి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. దశలవారీగా సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి విచ్చలవిడిగా మద్యం విక్రయించి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు.

మా డబ్బులు మాకు తిరిగివ్వండి

పప్పుల చీటీ బాధితుల ఆందోళన
వైస్ ఎంపిపి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

'మా డబ్బులు మాకివ్వండంటూ పప్పుల చీటీ బాధితులు కొండ గుంపాంలో పప్పుల చీటీ నిర్వాహకురాలు పతివాడ శ్రీలేఖ ఇంటిని చుట్టుముట్టారు. తాము ఏడాది పాటు చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విజయనగరం తోటపాలెం, జరజాపుపేట, గరికిపేట, బూరాడపేట, నెల్లిమర్ల, కొండ గుంపాం గ్రామాలకు చెందిన పప్పుల చీటీ భాదితులు మంగళవారం కొండ గుంపాంలో శ్రీలేఖ ఇంటికి వెళ్ళి కట్టిన డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. అదే గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ దగ్గరకు వెళ్ళి తమకు జరిగిన అన్యాయంపై గోడు చెప్పుకోగా 'మాకు చెప్పి పప్పుల చీటీ కట్టారా' అని ఎదురు ప్రశ్న వేశారని భాదితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాలంటీర్ శ్రీలేఖ మీద నమ్మకంతో లక్షలాది రూపాయలు చీటీలు కట్టామని, సంక్రాంతి పండుకు సరుకులు వస్తాయని గంపెడాశతో ఎదురు చూస్తున్న సమయంలో తమను మోసం చేసి మజ్జి అప్పల రాజుతో కలిసి నమ్మించి నట్టేట ముంచారని బాధితులు రోధిస్తున్నారు.

ఏజెంట్లను సైతం మోసం చేసి..

శ్రీలేఖ, అప్పలరాజు ఉచ్చులో చాలా మంది ఏజెంట్లు కూడా బలయ్యారు. వీరి మాటలు విని మహిళలు పెద్ద ఎత్తున ఏజెంట్లుగా చేరి వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేశారు. సతివాడ, గరికిపేట, కొండగుంపాంతో పాటు కొండకరకాం, విజయనగరంలో కూడా ఏజెంట్లు పనిచేసి ఏడాది కాలం పాటు కోట్ల రూపాయాలు వసూలు చేసి అప్పలరాజు గ్రూప్‌కు అందించినట్లు తెలిస్తోంది. బాధితులు సైతం మోసపోయిన వారికిచ్చిన కార్డులు చేత బట్టుకుని పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడు చాలా మంది ఏజెంట్లు కూడా ఆందోళన చెందుతున్నారు. బాధితులు నేరుగా తమ వద్దకు వచ్చి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఏం చేయాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఏజెంట్లలో ఎక్కువ మంది వాలంటీర్లు, మహిళలే ఉన్నారు. ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వాలంటీర్ శ్రీలేఖ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

వైస్ ఎంపిపి పై ఆరోపణలు

పప్పుల చీటీ మోసం వెనుక వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ పాత్ర ఉందని కొండ గుంపాం వైసిపి నాయకులు పతివాడ అప్పారావు మంగళవారం ఆరోపించారు. గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటకు చెందిన శ్రీలేఖను వైస్ ఎంపిపి పథకం ప్రకారం కొండగుంపాం గ్రామ వాలంటీరుగా వేయించారని, కోట్లాది రూపాయలు పప్పుల చీటీ స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. వెంటనే కలెక్టర్, ఎస్‌పి స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కోట్లాది రూపాయల స్కామ్ ఉచ్చు వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ చుట్టూ బిగిసుకుంటుంది.

లైఫ్‌జాకెట్లు ధరించిన సిబ్బందితో ఎస్ఇ నాగేశ్వరరావు, ఇఇ, ఎడిఇ

విద్యుత్తు ఉద్యోగులకు లైఫ్ సేఫ్టీ జాకెట్లు

ఎస్ఇ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి ఇపిడిసిఎల్ ఉద్యోగులు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా విద్యుత్ శాఖ తయారు చేసిన లైఫ్ సేఫ్టీ జాకెట్లను మంగళవారం ఆ శాఖ ఎస్ఇ పి.నాగేశ్వరరావు ఉద్యోగులకు అందజేశారు. కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లైన్ మెన్లకు, జూనియర్ లైన్‌మెన్లకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ స్తంభాలు ఎక్కడం, మరమ్మత్తులు చేయడం, విద్యుత్ పనులు చేస్తున్న సిబ్బంది విద్యుత్ షాక్‌కు గురి కాకుండా ఉండేందుకు ఈ లైఫ్ సేఫ్టీ జాకెట్‌లను ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1200 మందికి రూ.14 లక్షల ఖర్చుతో వీటిని తయారు చేయించినట్లు తెలిపారు. సిబ్బంది వీటిని విధి నిర్వహణలో తప్పకుండా వినియోగించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎడిఇ ఎల్.సత్యనారయణ, ఎఇ వర ప్రసాద్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో పని చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా చూడాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జరిగిన కన్వీనర్లు, వాలంటీర్లు, పార్టీ నాయకుల విస్తత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వంతోపాటు పార్టీ కూడా అండగా ఉంటుందన్నారు. సమన్వయంతో పని చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, అదే సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన లేఖను కూడా అందజేయాలని అన్నారు. విజయనగరంలో జోనల్ వారీగా కన్వీనర్లు, గృహ సారధుల సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని, కూలదోయాలని, పెత్తందారులు చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు డబ్బులు ఇచ్చి జనాన్ని తన మీటింగ్‌లకు తీసుకువచ్చి దానిని చూసి బలం అనుకుంటున్నారని అన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ఈ జిల్లాకు, విజయనగరం నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు తన పక్కన అశోక్ గజపతి రాజును నిలబెట్టుకొని నీతి నిజాయితీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ప్రభుత్వం వైద్య కళాశాలను మాన్సాస్ కు అప్పగిస్తే, దానికి చైర్మన్‌గా ఉన్న అశోక్ గజపతిరాజు చేతులెత్తేసిన వైనం నిజం కాదా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో అశోక్ గజపతిరాజు, టిడిపి నాయకులు ఎక్కడున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని అన్నారు. వాలంటరీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. విజయనగరం ఎమ్మెల్యే ఎగిరెగిరి పడుతున్నాడని, భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని చంద్రబాబు అన్నారని, వారికి దమ్ముంటే తను భూకబ్జాకు పాల్పడిన భూమిపై అశోక్ గజపతిరాజు ధర్నా చేయాలని సవాల్ విసిరారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలను మోసపూరిత మాటలతో, మధ్య పెట్టే ప్రయత్నం చేస్తూ ఉంటారని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు నరేష్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారధులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగరపాలక ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపిజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

నేడు, రేపు మంత్రి బొత్స పర్యటన

విజయనగరం : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 28,29 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు.ఆయన బుధవారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. ఉదయం మోపాడలో, మధ్యాహ్నం వేపాడలో జరిగే పార్టీ సమావేశాల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం రాజాంలో, మధ్యాహ్నం గరివిడి లో జరిగే పార్టీ సమావేశాలకు హాజరవుతారు. అనంతరం విశాఖపట్నం వెళ్తారు. 31వ తేదీ రాత్రి విజయనగరం వస్తారు.

జాతీయ స్థాయి భరతనాట్యం పోటీల్లో సత్య కళాశాల విద్యార్థిని ప్రతిభ

విజయనగరం : సత్య డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జి.పుష్ప లత ఇటీవల తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యం లో జరిగిన 32వ జాతీయ స్థాయి నృత్య పోటీలలో గ్రూప్ డాన్స్ లో ద్వితీయ స్థానం, సోలో లో తృతీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, అధ్యాపకులు, విద్యార్థులు పుష్పను అభినందించారు. పుష్ప భరతనాట్యం లో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని శశి భూషణరావు ఆకాంక్షించారు.

కెజిబివిని సందర్శించిన కేసలి

నెల్లిమర్ల : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు స్థానిక కెజిబివి కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. గతంలో నిరాశ్రులైన ముగ్గురు చిన్నారులను కెజిబివిలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారి పరిస్థితులు ఎలా ఉన్నాయన్న వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర బాలికలు సరైన సమతుల్య ఆహారంను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు లక్ష్యంతో చదవాలన్నారు. అనంతరం వంట గదులను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో కేంద్రం ప్రిన్సిపల్ ఉమా, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి యాళ్ళా నాగరాజు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వే పై అవగాహన సదస్సు

వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు రైతులకు మంగళవారం సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలోని ఆరికతోట జరుగుతున్న భూరీసర్వేను తహశీల్దార్ గణపతిరావు మంగళవారం పరిశీలించారు. భూ సర్వే చేస్తున్న విధానం, ఇప్పటి వరకూ చేపట్టిన సర్వేను సచివాలయ సర్వేయర్ సాయికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

కెల్ల గ్రామకార్యదర్శికి షోకాజ్ నోటీసు

గుర్ల : మండలంలోని కెల్ల పంచాయతీ కార్యదర్శికి జిల్లా పంచాయితీ అధికారి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళవారం కెల్ల పంచాయితీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సందర్శించిన సమయంలో గ్రామస్తులు గ్రేడ్ 4 కార్యదర్శి జనన ధ్రువపత్రాలు జారీ చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని డిపిఒకు ఫిర్యాదు చేయడంతో ఆయన కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఎంపిడిఒ కార్యాలయానికి అందినట్లు తెలిసింది.

సిఆర్‌పిఎఫ్ జవాను రక్తదానం

నెల్లిమర్ల : అత్యవసర పరిస్థితుల్లో సిఆర్‌పిఎఫ్ జవాన్ రక్తదానం చేశారు. మంగళవారం జిల్లాలో 4ఎస్ హాస్పటల్లో కాలుకు సర్జరీ నిమిత్తం చేరిన పూసపాటిరేగకు చెందిన ఎస్.రాములమ్మ (58)కు అత్యవసరంగా శస్త్ర చికిత్స కోసం అరుదైన బి.నెగిటివ్ రక్తం అవసరం వచ్చింది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు సిఆర్‌పిఎఫ్ జవాన్ మద్దిల సంతోష్‌కు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన సంతోష్ జిల్లా కేంద్రంలోని ఎన్ఎచ్ బ్లడ్ బ్యాంక్‌లో రక్త దానం చేసి పేషంట్ బంధువులకు సకాలంలో అందేలా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సహకరించారు. ఇప్పటి వరకూ 27సార్లు రక్త దానం చేసినట్లు సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుభోటు దుర్గాప్రసాద్ తెలిపారు. రక్తదాతను ఎన్ఎచ్ బ్లడ్ బ్యాంక్ ఇంఛార్జి నాగేశ్వరరావు, సాధన మిత్రులు పసు మర్తి వెంకటరమణ, వెంకటరావు, పేషంట్ బంధువులు అభినందనలు తెలిపారు.

నేడు మోపాడలో వైసిపి విస్తృత సమావేశం

డెంకాడ : మండలంలోని మోపాడ వద్ద ఉన్న భూమాత లేఔట్‌లో నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి వైసిపి విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నామని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మూడు జిల్లాల కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చంద్రశేఖర రావు, హాజరవుతారని చెప్పారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు ఈ నెల 29 నుండి 31వ తేదీ వరకు కడప జిల్లా, ప్రొద్దుటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. ఎంపికైన కుప్ప కళావతి, పి.నేహా, రాజాన నిఖిల్, నాయుడులను పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మి బి.ఇడు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తూ, జాతీయ స్థాయి పోటీలలో స్థానం సాధించాలని ఆకాంక్షించారు.

గౌరీ సేవా సంఘం సేవలు స్ఫూర్తిదాయకం

విజయనగరంటౌన్ : శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం తన నివాసంలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను కోలగట్ల ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్, కార్పొరేటర్ పిళ్లా రాధాభవాని మాట్లాడుతూ ప్రజలలో ఆధ్యాత్మికత, సేవా భావం పెంపొందించేందుకు తమ సంఘం ద్వారా కేలండను రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆదారి రుక్మిణి, సంఘం గౌరవ అధ్యక్షులు భీశెట్టి ఓం శంకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

విజయనగరంటౌన్ : పేదలకు అండగా ఉంటూ ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రోగాలకు ఉచితంగా వైద్యం అందించే నిమిత్తం సంవత్సర కాలం పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలకు అవసరమైన వారికి వైద్య సేవలు అందుతున్నాయని, చిన్నచిన్న వైద్య సేవలు కూడా ఉచితంగా అందించేందుకు డాక్టర్ శ్రీరామ్మూర్తి సహకారంతో ఏర్పాటు చేశామని తెలిపారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ వైద్య శిబిరం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సేవా దక్పథంతో ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నామన్నారు.

12న యువశక్తి బహిరంగ సభ

శృంగవరపుకోట : వచ్చేనెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా రణస్థలం వేదికగా జరగబోయే యువశక్తి బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు ఒబ్బిన సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, అన్ని మండలాల జనసైనికులు, నాయకులు, వీర మహిళలు, చేతుల మీదుగా యువశక్తి కార్యక్రమం, బహిరంగ సభకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జనవరి 12వ తేదీన జరగబోవు 'యువశక్తి' భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపిచ్చారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ జి. ఈరన్న మంగళవారం తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఈ 7995691295, 7989826953 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

మునగ మొక్కలు పంపిణీ

వంగర : మహిళా స్వయం సహాయక సంఘాలకు వంగర ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ చేతుల మీదుగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మునగ మొక్కలను పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో మొక్కలు నాటడం ఎంతో అవసరమని అన్నారు. వెలుగు సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నెల్లిమర్ల : మండలంలోని బెక్కలి గ్రామానికి చెందిన అరసాడ అప్పల నాయుడు (38) పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడు తాగుడుకు బానిసై కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. ఎప్పటికప్పుడు తన భార్య పిల్లలను తాగి కొట్టడంతో విసుగు చెందిన వారంతా వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి ఢీకొని వ్యక్తి మృతి

డెంకాడ : విజయనగరం నాతవలస రహదారిలో పోలీసు స్టేషన్ సమీపంలో ఆర్‌టిసి బస్సు ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఎలిశోటకు చెందిన గుండు వెంకటరావు(60) తన ద్విచక్ర వాహనం మీద మంగళవారం తిప్పలవలస వెళ్ళడానికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్‌టిసి బస్సు బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన వెంకటరావును జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం

వేపాడ : మండలంలోని సోంపురం జంక్షన్ నుండి వేపాడ, ఆనందపురం వరకు గల 19 కిలోమీటర్ల విస్తరణ పనులకు మోక్షం కలిగింది. ఈ మేరకు సుమారు రూ. 39 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో మంగళవారం పనులను ముమ్మరం చేశారు. ఈ రోడ్డుకు సుమారు 50 కల్వర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా ఇప్పటికే 20 కల్వర్టులు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విస్తరణ పనులు జరుగుతున్న రహదారి

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - వేపాడ

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం ఇప్పటికే 50 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మండలంలోని మొత్తం 393 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ట్యాబ్‌లను వినియోగించుకుని చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పారావు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ వివి.చినరామునాయుడు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, కోపరేటివ్ మెంబర్ రామూర్తినాయుడు, మండల వైసిపి అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మెరుపుల సత్యనారాయణ, వేపాడ గ్రామ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఎంపిటిసి గంగాలక్ష్మి, వల్లంపూడి వైస్ సర్పంచ్ రుద్ర వెంకట్రావు, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి సిహెచ్. సూర్యనారాయణ, ఎంఇఒ బి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : ప్రతి విద్యార్థి ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. మంగళవారం మండలంలోని మోడల్ పాఠశాల, గిరిజన పాఠశాల, కెజీబీవీ పాఠశాల, బుడతనపల్లి, రెక్కీడం, రామవరం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్యాబ్‌లను ఉపయోగించుకుని విద్యలో అభివృద్ధి చెందాలని అన్నారు. జెడ్‌పిటిసి నరేసింహమూర్తి మాట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి ట్యాబ్‌లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిని సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మండల విద్యాశాఖాధికారి కె. విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను వినియోగించుకోవాలని

వేపాడ: విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ఎంపిపి అంబళ్ల సుధారాణి అన్నారు. మంగళవారం సారిపల్లి, అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, సారిపల్లి సర్పంచ్ రాయి పైడమ్మ, అలుగోలు సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, సారిపల్లి ఎంపిటిసి మజ్జి త్రివేణి, మాజీ సర్పంచ్ రాయి విభీషణ రావు, ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావు, సారిపల్లి, అలుగోలు జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు డి. రాము, నల్లా జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక జడ్‌పిహెచ్ స్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే శంబంగి చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు నెమలంలోని పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎన్. ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపిలు సత్యనారాయణ, రమాదేవి ఎఎంసి చైర్మన్ శ్రీనివాసరావు, ఎస్. సత్యవతి, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, ఎంఆర్ఒ డి.రాజేశ్వర రావు, సర్పంచ్ రూపావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి మండలం పేరిపి, కర్లాం, పి.కె.పాలవలస, దేవరపొదిలాం స్కూల్లో విద్యార్థులకు మంగళవారం ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల పార్టీ సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనుబాబు, బాణాన శ్రీను, చింతాడ చందర్రావు, కోరాడ పృథ్వి, రెల్లి అప్పలనాయుడు, బైరెడ్డి సత్యవతి, బాణాన రమణ, కర్రెపు సన్యాసప్పడు, కోరాడ నారాయణరావు, ఎంఇఒ లక్ష్మణ, పెద్ది గోవింద, గునినాయుడు, ఎంఇఒ భాను ప్రకాష్, హెచ్ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భోగాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే పి.రఘువర్మ, జెడ్‌పిటిసి సభ్యులు పడాల మంజులత ఆధ్వర్యాన విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, సర్పంచ్ వాసుపల్లి ఎర్రయమ్మ ట్యాబ్‌లను అందజేశారు. 32 మంది విద్యార్థులకు, ఐదు మంది ఉపాధ్యాయులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడివాడ శ్రీదేవి, వాసుపల్లి రేయుడు, విద్య కమిటీ చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు 'కోరెడ్ల' మాస్టారు

ప్రజాశక్తి - బొబ్బిలి

కోరెడ్ల సంజీవినాయుడు మాస్టారు సమాజానికి ఆదర్శనీయులను డిప్యూటీ డిఇఒ తిరుపతినాయుడు అన్నారు. సంజీవినాయుడు వర్ధంతి సభలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయునిగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని, రైతులతో కలిసి ఉద్యమాలు చేసారని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తి ఆదర్శమని అతని కుమారుడు కీర్తి శేషులు శేషగిరి మాస్టారు కూడా మంచి ఉద్యమ నేతగా గుర్తింపు సాధించారని చెప్పారు. మిగిలిన ముగ్గురు పిల్లలు సమాజంలో మంచి మార్పు కోసం పనిచేస్తున్నారని కుమార్తె డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రస్తుత శృంగవరపుకోట (గ్రామీయేట్) పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఇలా చైతన్య వంతులుగా తీర్చిదిద్దారని, ఇది ఒక కుటుంబంలో గొప్ప విషయంగా చెప్పవచ్చునని కొనియాడారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరీ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు కోసం, విద్యా రంగం కోసం యుటిఎఫ్ చేస్తున్న కృషిని తెలియ చేస్తూ, నాన్న వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రశ్నించే తత్వాన్ని ఆయన మాకు అలవాటు చేసారని ప్రశ్నించడం గొప్ప మార్పు అని అన్నారు. అనంతరం పదవతరగతి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను విడుదల చేసి పదవతరగతి విద్యార్థులకు అందచేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఎంఇఒ లక్ష్మణరావు, జెడ్‌పిడి పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు, కెజిబివి ప్రిన్సిపాల్ స్వప్న, యుటిఎఫ్ నాయకులు బి.రమేష్, రెడ్డి రాంబాబు, లావణ్య, శారదారాణి, సత్యనారాయణ, రాజు పేట గ్రామం పెద్దలు కె.తిరుపతిరావు, పి.రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు సంజీవినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మోడల్ పేపర్లను అందిస్తున్న తిరుపతినాయుడు

సవరవిల్లిలో 'ఇదేమి కర్మ'

భోగాపురం : మండలంలోని సవరవిల్లిలో మంగళవారం రాత్రి ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రాన్ని నియోజకవర్గ ఇంఛార్జి పతివాడ నారాయణస్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, ప్రస్తుత రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నీలపు అప్పలరామి రెడ్డి, కోరాడ తాతారావు, పిడుగు తోటరావు, కర్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

సవరవిల్లిలో నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మండలంలోని గుడివాడ గ్రామ అగ్ని బాధితులు కొలుసు సన్యాసి, రిక్క కొండమ్మ కుటుంబాలకు మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ చేతుల మీదుగా బట్టలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు 25కేజీలు బియ్యం, వంట సామగ్రి, రూ.2వేలు, దుప్పటి, బట్టలు, ఇతర నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు నీలపు అప్పల రామిరెడ్డి, భోగాపురం క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి, పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, గుడివాడ సర్పంచ్ చిల్ల జమున, యూనిట్ ఇంఛార్జి కొండపు ఈశ్వరరావు, ఎరుసు అప్పలనర్సయ్య, టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పూసపాటిరేగ మండలం వెల్దూరు పంచాయతీ కెలుగుపేట అగ్నిప్రమాద బాధితులకు కూడా నిత్యావసరాలు అందజేసినట్లు కర్రోతు బంగారురాజు ఈ సందర్భంగా తెలిపారు.

గడపగడపకూ అధికారుల డుమ్మా

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని బంటుపల్లి సచివాలయ పరిధిలో పేడాడ తమ్మాపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ఒకటి రెండు శాఖల అధికారులు తప్ప మిగిలిన శాఖల అధికారులు ఎవరూ పాల్గొనలేదు. ఒకపక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెట్టి అన్ని శాఖల అధికారులు, ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేతో పాటు మిగిలిన ప్రజా ప్రతినిధులను కలుపుకొని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి అక్కడ సమస్యను తెలుసుకొని అర్హులైన వారి సమస్యలు పరిష్కరించాలని పదే పదే చెబుతున్నా ఇక్కడ అధికారులకు అవేవీ పట్టకపోవడం విడ్డూరంగా ఉంది. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు, ఒకటి రెండు శాఖల అధికారులు తప్ప మిగిలిన ఏ శాఖ అధికారులు కనిపించకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న వాదన వినిపిస్తోంది. చాలా మంది అధికారులు కార్యక్రమం ప్రారంభంలో ఎమ్మెల్యేకు కనిపించి తిరిగి వెళ్లిపోతున్నట్లు తెలిసింది. గ్రామాల్లో ప్రజలు చెప్పిన సమస్యను నోట్ చేసుకునే వారే లేరన్న విషయం పేడాడ తిమ్మాపురంలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం తేటతెల్లమైంది. ఎమ్మెల్యేను ఇంటింటికి తీసుకెళ్లడం ఒకేచోట నిలబెట్టి రెండు మాటలు మాట్లాడించి కార్యక్రమాన్ని ముగించడం నిత్యకృత్యం అవుతోంది. సమస్యలను వినడమే కాకుండా లబ్ధి పొందినవారికి బ్రోచర్లను కూడా అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఈ గ్రామంలో కార్యక్రమం ఉదయం మూడు రోజుల క్రితమే సమాచారం అందించినా కార్యక్రమం గందరగోళంగా అస్తవ్యస్తంగా జరిగింది. ఇప్పటికైనా అధికారులందరూ గడపగడపకు కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు లేకుండానే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలు వైసిపితోనే సాధ్యం

సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లి సచివాలయం పరిధిలోని రాజుల తమ్మాపురం, పేడాడ గ్రామాల్లో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందే తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

మండలంలోని రాజుల తమ్మాపురం గ్రామంలో సుమారు రూ. 3.77 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

దుకాణాలపై దాడులు

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా మంగళవారం మొయిద జంక్షన్ ఏరియాలో షాపులపై నగర పంచాయతీ కమిషనరు పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడిన వారి వద్ద 5 కేజీలు ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ. 3వేలు జరిమానా విధించారు. పట్టణంలో ఎక్కడా పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లను విక్రయించకుండా నిషేధించి గుడ్ సంచులు మాత్రమే వాడాలని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో శానిటరీ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస రావు, శానిటరీ కార్యదర్శులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

వంగర : మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే వేగవంతం చేయాలని చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం.అప్పారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డి. ఐజాక్‌తో మాట్లాడి సర్వేకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి సుందర రావు, ఆర్.ఐ. జామి మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం పై శిక్షణ

వంగర : గ్రామాల్లో ప్రజలు నీరు వృథా చేయకుండా వినియోగించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై విఒలకు పారిశుధ్య వెలుగు కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి మాట్లాడుతూ వివిఎల మహిళా సంఘాల బాధ్యత వహించడం తోపాటు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత వంటి అంశాలను ప్రజలకు వివరించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ ఆర్. భాస్కరరావు, ఎపిఎం మీసాల చక్రపాణి పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రేగిడి:

ప్రాథమిక స్థాయి నుంచే విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విద్య అందించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, మండల వైసి మజ్జి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణి, కే శ్రీనివాసరావు, తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ్ రావు, ఎంఇఒ ఎం వరప్రసాదరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భుజంగరావు, ఎంఆఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రేగిడి: మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

వారు మాట్లాడుతూ నవరత్నాలతో ప్రతి పేదవానికి సంక్షేమ పథకం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు, టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, నెల్లి పెంటం నాయుడు, కే. శ్రీనివాసరావు, చుక్క వెంకటి నాయుడు, ఎంపిడిఒ జి. కాశీ విశ్వనాధ్ రావు, డిప్యూటీ తహశీల్దార్ గోవిందరావు, ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, ఆర్డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గడప గడపకు మహిళలకు ఆదరణ

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం కొండవలస గ్రామంలో సర్పంచ్ తుమ్మి వెంకటరమణ ఆధ్వర్యంలో గడప, గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా

బల్లంకిలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో రెండవ రోజు మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, డిసిసి చైర్మన్ వి.వి చిన్నరామునాయుడు, సర్పంచ్ బల్లంకి లక్ష్మి, బాణాది గ్రామ సర్పంచ్ కర్రి యశోద, బొద్దు శీను, నాయకులు బీల సతీష్, బల్లంకి కనకరాజు, వేచలపు రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

వేపాడ : విద్యార్థులు జీవితంలో చేయాల్సినవి, చేయకూడనివి అనే అంశం పై మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రముఖ కౌన్సిలర్, మోటివేటర్ అచ్యుతరావు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నేటి సమాజంలో సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, స్నేహితులు వంటి అంశాలు విద్యార్థి జీవితంలో ఏ విధంగా ప్రభావం చేస్తున్నాయో వివరించారు. విద్యార్థి దశలో ఎటువంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ఎటువంటి అంశాలను దూరంగా ఉంచాలో వంటి వాటిపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం 100 మంది విద్యార్థులకు జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది రమాదేవి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మహారాజశ్రీ శృంగవరపు కోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EA 09/2021 in EP 06/2010 in OS 54/2001

బూసర్ల రమణ (late) ....డిక్రీ హోల్డర్

మరియు

జలగడుగుల అప్పారావు వగైరాలు

....జడ్జిమెంట్ డెటార్స్

పై నెంబరు ఎఎలలో ప్రతివాదులు 2,4,5 ఆసామీలు (1) జలగడుగుల నాగమ్మ, (2) జలగడుగుల వెంకటలక్ష్మి (3) జలగడుగుల శ్రీను కోర్టు నోటీసులు అందనందున పై 3 ఆసామీలు తే 06-01-2023దీన మహారాజశ్రీ శృంగవరపు కోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఉదయం 10గంటలకు హాజరై మీ వాదన ఇవ్వవలెను. అట్లు హాజరు కాని యెడల మీపైన పరోక్షంగా తీర్మానం జరుగునని తెలియచేయడమైనది.

టి.వి.రమణమూర్తి,
అడ్వకేట్, ఎస్.కోట

క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చునని డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు అన్నారు. కెజిబివి పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదవాలని కోరారు. క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆయనతో మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డిఇఒ తిరుపతినాయుడు చెప్పారు. కెజిబివి పాఠశాలల్లో నూపర్ 60 బ్యాచ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బొబ్బిలి, బాడంగి, విజయనగరం పాఠశాలల్లో సూపర్ 60 బ్యాచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 100మంది విద్యార్థులు దాటిన పాఠశాలల్లో టాపర్స్‌ను గుర్తించి డైలీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కువ మార్కులు స్కోర్ చేసేందుకు, వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉపాధ్యాయులు బదిలీలపై 530 ఫిర్యాదులు వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 297 ప్రభుత్వ పాఠశాలల్లో 19,022 మంది చదువుతున్నట్లు చెప్పారు.